టీడీపీ హయాంలో పాతబస్టాండ్ కూల్చి కేసు పెట్టించారు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ఆరో వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పాతబస్టాండ్‌ను కూల్చడం అన్యాయమని ప్రశ్నించినందుకు తనతోపాటు మరో 28 మంది కార్యకర్తలపై మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కేసు పెట్టించారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని బూట్ల సుబ్బారెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే గురువారం విలేకరులతో మాట్లాడారు. పాత బస్టాండ్‌పై ఆధారపడి చాలా మంది పేదలు ఉపాధి పొందుతున్నారన్నారు. 2018లో వరదరాజులరెడ్డి రాత్రికి రాత్రే పాత బస్టాండ్‌ను కూల్చి వేశారన్నారు. ఈ విషయంపై ప్రశ్నించినందుకు తమపై కేసు పెట్టించారని, విజయవాడలో కోర్టులో జరుగుతున్న వాయిదాకు బుధవారం తాను హాజరయ్యాయనన్నారు. అదే తరహాలో మున్సిపల్ పార్కులో ఓవర్ హెడ్ ట్యాంక్ కట్టించేందుకు గుంతలు తవ్వడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాత బస్టాండ్‌ను తిరిగి నిర్మించి పేదలకు అండగా నిలిచామన్నారు. మున్సిపల్ పార్కులో తవ్విన గుంతను పూడ్చి కొత్తగా పార్కును అభివృద్ధి చేశామన్నారు. ప్రతి నెలా వేలాది మంది పార్కును సందర్శిస్తూ ఆనందంగా ఉన్నారన్నారు. అలాగే తన సతీమణి రమాదేవిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారని తెలిపారు. వరదరాజులరెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులైనా నేతలుగా ఉండి ఎలా ఎస్సీ, ఎస్టీలను దూషిస్తారన్నారు. ఉద్దేశ పూర్వకంగానే తన సతీమణిపై వరద కేసు పెట్టించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ఎంతో ప్రేమాభిమానులతో తాము అక్కున చేర్చుకుంటున్నామని, అలాంటి వారిని ఎలా దూషిస్తామన్నారు. తన సోదరుడు కిరణ్‌కుమార్‌రెడ్డిపై అన్యాయంగా రౌడీషీటర్ కేసు నమోదు చేయించారని అన్నారు. పాత బస్టాండ్ కేసు విషయం అప్పట్లో పత్రికల్లో ప్రధానంగా ప్రచురితమైందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వరద ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. చేసిన సంఘటనలకు తప్ప తమ ప్రభుత్వ హయాంలో ఎవరి మీద ఉద్దేశంగా కేసులు పెట్టించలేదన్నారు. ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, సీఎం సురేష్ నాయుడుతోపాటు ఎవరి మీద కేసులు లేవన్నారు.

ఒక్క ఇల్లు నిర్మించని చంద్రబాబును ఏమనాలి?

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించని చంద్రబాబును ఏమని పిలవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. గతంలో రెండు సెంట్లలో ఇల్లు కట్టించి ఇస్తానని చెప్పిన మాట వాస్తవమేనన్నారు. ఆమేరకు ఒకటిన్నర సెంటులో ఇల్లు కట్టి ఇస్తున్నామని తెలిపారు. మాట తప్పినందుకు తనను దూషించాల్సిందిగా టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి చెబుతున్నారని, ఒక్క ఇల్లు నిర్మించని చంద్రబాబును ఏమని దూషించాలని అన్నారు. నియోజకవర్గంలో మార్కెట్ నిర్మాణం, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ, ఆర్టీసీ బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణాలతోపాటు రూ.110 కోట్లు వెచ్చించి మున్సిపాలిటీని అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు విస్తరించామని, కాలువలను నిర్మించామని వివరించారు. నిత్యావసర వస్తువులతోపాటు గ్యాస్, డీజిల్, పెట్రోలు ధరల పెరుగుదల రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు టీడీపీ నేతలు తమ పార్టీపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లను అమ్ముకునేందుకు వీలుగా ఏకంగా జగనన్న రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారన్నారు. రూ.150 కోట్లతో తాగునీటి పథకం పూర్తి చేశామని చెప్పారు. ఆటోల ద్వారా కసువు సేకరణకు వెళుతూ చెత్త పన్ను వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ డబ్బు మున్సిపాలిటీ అభివృద్ధికే ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆరో వార్డు కౌన్సిలర్ వై.జయంతి పాల్గొన్నారు.

ఆరో వార్డుకు రూ.27 కోట్లతో సంక్షేమ పథకాలు

మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.27 కోట్లతో సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరుతూ ఎమ్మెల్యే రాచమల్లుతోపాటు ఆయన సతీమణి, 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరో రూ.1.45 కోట్లతో వార్డులో సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించామని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్ జయంతి, వార్డు ఇన్‌చార్జి సురేష్ యాదవ్, ఎంపీపీ శేఖర్ యాదవ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాష్ చంద్రబోస్, అరసం జిల్లా అధ్యక్షుడు నాగులారపు విజయసారథి, కౌన్సిలర్లు పాతకోట మునివంశీధర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, జిలాన్, సత్యం, నాయకులు ఎమ్మార్పీఎస్ సుధాకర్, నరసింహులు, సుబ్బరాయుడు, మడక రాము, సుదర్శన్, బండారు సూర్యనారాయణ, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పస్నేటి కాశయ్య, కాకర్ల లింగారెడ్డి, గడ్డం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు తంబళ్ళపల్లెలో ప్రచారం

కలసపాడు : మండలంలోని తంబళ్ళపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం సాయంత్రం 4–30 గంటలకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుదర్శన్, జేసీఎస్ కన్వీనర్ చిత్తారాజశేఖర్‌రెడ్డిలు తెలిపారు. తంబళ్ళపల్లె గ్రామ పంచాయతీలోని దిగువ తంబళ్ళపల్లె, ఎగువ తంబళ్ళపల్లె, సింగరాయపల్లె, దిగువపల్లె గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చంద్రశేఖర్ కుమార్తె లోహితకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరులో ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ తన కార్యాలయంలో గురువారం జిల్లాలోని నలుగురికి రూ.9 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక దేవాంగపేటకు చెందిన దివంగత పోసా చంద్రశేఖర్ అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స కోసం చేసిన ఖర్చులకు రూ.3.50 లక్షలు, జిల్లాలోని మరో ముగ్గురికి రూ.5.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



నక్కలదిన్నె పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్

చాపాడు : మండల పరిధిలోని పలుపోలింగ్ స్టేషన్లను జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్ఓ ఎ.చంద్రమోహన్ గురువారం పరిశీలించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లలో వసతుల ఏర్పాట్లపై ఆయన పర్యవేక్షించారు. మండల పరిధిలోని నక్కలదిన్నె, వి.రాజుపాళెం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎన్నికల రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరా, ఇతర వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.భూషణం, రీ సర్వే డీటీ ప్రవీణ్, మండల సర్వేయర్ సాయిలత, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న అర్బన్ సీఐ యుగంధర్

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ పి.యుగంధర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించి వ్యాపారస్తులకు, ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సిద్దవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డులలో గల వ్యాపారస్తులు తమ దుకాణాలకు వచ్చే ప్రజలకు నిబంధనలపై అవగాహన కల్పించి, వాహనాలు రోడ్లపై ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ చంద్రానాయక్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ పన్ను రిటర్న్ బిల్లులు మంజూరు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఫిబ్రవరి నెల ఉపాధ్యాయుల వేతన, ఇన్‌కాం ట్యాక్స్ రిటర్న్‌ల బిల్లులను మంజూరు చేయాలని ప్రొద్దుటూరు ఉపఖజానాశాఖాధికారి ఎం.తిరుపతిస్వామికి గురువారం ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఉపఖజానాశాఖ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు, దువ్వూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయుల ఫిబ్రవరి నెలకు సంబంధించి వేతన బిల్లులతోపాటు ఇన్‌కాం ట్యాక్స్ రిటర్న్‌ల సమర్పణలో ఎటువంటి ఆటంకాలు లేకుండా మంజూరు చేయాలని కోరారు. నిబంధనల మేరకు పరిశీలించి మంజూరు చేస్తామని ఎస్టీఓ తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్ ఆసిఫ్ హుస్సేన్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు


అనాథ శరణాలయంలో కేక్ కట్ చేస్తున్న మత్స్య సహకార సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్ర మత్స్యశాఖమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు జాతీయ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో గురువారం బద్వేలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయడంతోపాటు నిరాశ్రయుల వసతిగృహంలో వృద్ధులకు అన్నదానం చేసి షాలోమ్ అనాథశరణాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కందుకూరి సోమయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభ్యున్నతికి, మత్స్యకారుల ఉన్నతికి అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు రాబోవు రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వీడియో కాల్ ద్వారా చిన్నారులతో మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బోలా నారాయణ, ఫిషర్‌మ్యాన్ సొసైటీ సభ్యులు శ్రీనివాసులు, విజయకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలి
- ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. కమాండ్ కంట్రోల్ సిబ్బందితో పాటు పట్టణంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో గురువారం సాయంత్రం డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు రద్దీగా ఉండే బ్యాంకులు, హోటళ్ల తదితర ప్రాంతాల్లో మూవింగ్ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ డ్యూటీలో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని, ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారాన్ని సేకరిస్తూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పోలీసు సెక్టార్ అధికారులు పోలీస్‌స్టేషన్లను సందర్శించి ఏదైనా ప్రతికూల పరిస్థితులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. ఆ సెక్టార్‌లోని వివాదాస్పద వ్యక్తులను గుర్తించి సమాచారం ఇవ్వాలని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో అందరూ బాగా పని చేసి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి :

మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించేవారు వారు ఇకపై సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ తెలిపారు. మట్కా నిర్వాహకులకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో మట్కా నిర్వహించిన వారు జూదానికి స్వస్తి పలకాలని లేదంటే వారిపై పీడీ యాక్టును అమలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పట్టణంలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

యూనిఫాం లేకుండా ఆటోలు నడపొద్దు

ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫాం ధరించాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం సాయంత్రం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఆటోలను ఆపుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని అందించి పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ యుగంధర్, ఎస్ఐ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వేలం పాటలు వాయిదా

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో గురువారం నిర్వహించిన వేలం పాటలలో రెండు వాయిదా వేసినట్లు దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. దేవస్థానం ఆవరణలో భక్తులు సమర్పించుకున్న తల వెంట్రుకలు, బుక్ స్టాల్ ఏర్పాటు, టీటీడీ వతి గృహాల దగ్గర మరుగుదొడ్ల నిర్వహణకు మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్వహణ హక్కును రూ.2.82 లక్షలకు నాగిపోగు పుల్లయ్య దక్కించుకున్నారు. తలవెంట్రుకలు, బుక్ స్టాల్‌కు సరైన పాట రానందున వాయిదా వేస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. తిరిగి ఎప్పుడు పాటలు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : విద్యతోపాటు క్రీడా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. గురువారం బి.మఠం బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన థింకింగ్ డే సందర్భంగా స్కాస్ సర్టిఫికెట్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు పటిష్ట పాఠశాల గదులు, రుచికర భోజనం, ఉత్తమ విద్యతోపాటు క్రీడా సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లు, షూష్ అందజేస్తోందన్నారు. అమ్మ ఒడి ద్వారా పేదలను ఆదుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో స్కాస్ జిల్లా సెక్రటరీ ప్రమీల, అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా, రీజనల్ ఇన్‌చార్జిలు నరసింహారెడ్డి, అహ్మద్, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సకాలంలో పథకాలు


నరసాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న పీఆర్‌ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : ప్రజలకు సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయని పీఆర్ అండ్ ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 1వ సచివాలయాన్ని సందర్శించి, అక్కడి సిబ్బందితో మాట్లాడారు. రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా 1.45 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మూడేళ్లలోనే వారందరినీ రెగ్యులర్ చేశారని, 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఉత్తమ సేవలందుతున్నాయన్నారు. మొదటిసారి ముఖ్యమంత్రిగానే ఇన్ని అద్భుతమైన పనులు చేశారంటే.. మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి అయితే ఇంకెన్ని మంచి పనులు చేస్తారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. జగనన్న 20 ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలిస్తే దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచి పోతుందన్నారు. 2024లో మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా తెచ్చుకోవాలని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

కాశినాయన : అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందించాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం సచివాలయం, ఆర్బీకే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నరసాపురం ఆసుపత్రి 8వ స్థానం, రాష్ట్రంలో 53వ స్థానంలో ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని వైద్యాధికారులకు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, 104, ఏఎన్‌ఎంల పనితీరు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌ఎంలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి ఇంటి వద్దనే మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య సిబ్బంది, వీపీఏలు పాల్గొన్నారు.

ఆప్కాస్ ద్వారా కార్మికులకు సౌకర్యాలు


మాట్లాడుతున్న ఆప్కాస్ బోర్డు డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి

ప్రొద్దుటూరు : ఆప్కాస్ ద్వారా కార్మికులకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందని ఆ సంస్థ బోర్డు డైరెక్టర్లు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో గురువారం సాయంత్రం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఆశయంతో ఆప్కాస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కార్మికులందరికీ అందిస్తామన్నారు. పేర్ల నమోదులో ఏవైనా సాంకేతిక సమస్యలుంటే సవరిస్తామని తెలిపారు. సమావేశం అనంతరం కార్మికులతో భేటీ అయ్యారు. మొత్తం 350 మంది కార్మికులు పని చేస్తుండగా 40 మంది కార్మికుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆప్కాస్ మేనేజర్ డేనియల్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల కృషి ఎనలేనిది


వలంటీర్ స్వర్ణలతకు సేవా వజ్ర అవార్డును అందిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అంజనీకుమారి

రాజుపాళెం : ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల కృషి ఎనలేనిదని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని టీటీడీ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం వలంటీర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ నేడు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్రలో చెప్పిన మాట ప్రకారం వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మండలంలో సేవా వజ్ర అవార్డులను కొర్రపాడు స్వర్ణలత, కుమ్మరపల్లె చంద్రయ్య, సేవా రత్న అవార్డులను కొర్రపాడు భూలక్ష్మి, వెలవలి నజీవుల్లా, ఏరువపాలెం ఆజమాల్, కుమ్మరపల్లె శివలక్ష్మి, పర్లపాటు శైలజ, సేవా మిత్ర అవార్డులను 155 మందికి అందించారు. వారికి జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, నారాయణరెడ్డి, రాజారాం రెడ్డి, ఎంపీటీసీ శివనాగిరెడ్డి, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, ఉమామహేశ్వరి సాజియ, కోఆప్షన్ సభ్యురాలు గౌసియా, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువా కప్పి సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు.

మహిళకు అరుదైన వెన్నెముక శస్త్రచికిత్స


శస్త్రచికిత్స చేసిన డాక్టర్ కదిరి వెంకటేష్


ఆపరేషన్ తర్వాత మహిళ వెన్నెముక స్వరూపం

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వెంకటేష్ స్పైన్ సెంటర్‌లో.. వెన్ను నొప్పితో బాధపడుతున్న 65 ఏళ్ల మహిళకు మినిమల్లీ ఇన్‌వాసివ్ స్పైనల్ అనే అరుదైన శస్త్రచికిత్స చేశారు. భారీ కాయంతో ఉన్న ఈమె కొన్నేళ్లుగా షుగర్, బీపీ, రక్తహీనత, నడుం నొప్పితో బాధపడుతుండేది. రెండు కాళ్లు వాపు ఉండటంతోపాటు తిమ్మిరితో మొద్దుబారి పోయాయి. రెండు అడుగులు కూడా ముందుకు నడవలేని పరిస్థితి. పట్టణంతోపాటు ఇతర ప్రాంతాల్లోని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో చూపించినా.. వ్యాధి కుదుట పడలేదు. దీంతో ఆమె ప్రొద్దుటూరులోని వెంకటేష్ స్పైన్ సెంటర్‌లోని డాక్టర్ కదిరి వెంకటేష్‌ను సంప్రదించారు. అన్ని పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పూర్తిగా నయమవుతుందని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో జబ్బుకు కారణమైన ఎల్–3, ఎల్–4, ఎల్–5, ఎస్–1 డీకంప్రెషన్, ఫిక్సేషన్ ఫ్యూషన్ శస్త్రచికిత్సను బుధవారం విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోనే ఇలాంటి చికిత్స తమ ఆస్పత్రిలో చేయడం ప్రథమని డాక్టర్ చెప్పారు. ఆపరేషన్ చేసిన మరుసటి రోజే ఆమెను డాక్టర్ నడిపించారు. ఎలాంటి సపోర్టు లేకుండా నడిచి రెండో రోజు డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ అతి తక్కువ కాటుతో శస్త్రచికిత్స చేయడం వల్ల రక్తస్రావం కూడా తక్కువగా అవుతుందని తెలిపారు. వెన్ను నొప్పికి మైక్రో కీ హోల్ సర్జరీ చేస్తామని చెప్పారు. వెన్ను నొప్పితో బాధపడేవారు అపోహలకు లోను కావద్దని, కొత్త టెక్నాలజీతో వెన్ను సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన వివరించారు.

ప్రభువు దీవెనతో జిల్లా వాసులకు సుఖ శాంతులు


రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు ఆశీస్సులతో జిల్లా వాసులందరికీ సుఖ శాంతులు పుష్కలంగా లభించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాష ఆకాంక్షించారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చిలో రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఐజాక్ వరప్రసాద్ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన బిషప్‌ను కలిసి శుభాకాంక్షలు అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అంజాద్‌బాష మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం జిల్లా వాసులు ఏసు ప్రభువును ప్రార్థించాలని కోరారు. నగర డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ జిల్లాతోపాటు రాష్ట్ర మంతటా సుభిక్షంగా ఉండాలని, ఎలాంటి అలజడి, అశాంతి లేకుండా ప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేలా ప్రభువు ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ సందర్భంగా బిషప్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, జయ చంద్రారెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మాస్టర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి


ప్రొద్దుటూరు కల్చరల్ : ఉయ్యాలవాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు


ప్రొద్దుటూరు : ఉయ్యాలవాడ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏపీ రెడ్డి సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి, సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయుల గుండెల్లో దడ పుట్టించిన తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గజ్జల వెంకటేశ్వరరెడ్డి, ముడిమేల కొండారెడ్డి, టంగుటూరు మారుతి ప్రసాద్, బూతూరు వెంకటరామిరెడ్డి, పద్మవీరన్న, కోటా ఓబుళరెడ్డి, నంద్యాల వెంకటశివారెడ్డి, విష్ణు నారాయణ, యడవల్లి రమణయ్య, మల్లికార్జున, బీవీ సుబ్బారెడ్డి, పగిడాల నరసింహారెడ్డి, రామిరెడ్డి, ఏరువ లక్ష్మిరెడ్డి, రంగారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పాలగిరి కేశవరెడ్డి, అంకాల కొండయ్య, లింగాల ప్రసాద్‌రెడ్డి, సుధాకృష్ణార్జునరెడ్డి, రామాంజనేయరెడ్డి, గురుమోహన్‌రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెడ్డి సంఘం ప్రొద్దుటూరు అధ్యక్షుడు గజ్జల పెద్దవేమారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆసం దస్తగిరిరెడ్డి, నాయకులు బొమ్ము లక్ష్మి పుల్లారెడ్డి, కేసీ ఓబుళరెడ్డి, కోట ఓబుళరెడ్డి, పాలగిరి కేశవరెడ్డి, వంగల వెంకటేశ్వరరెడ్డి, బద్రి లక్ష్మీ రంగారెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, తెలుగు పండిట్ జ్యోతిమహేష్ ఉపాధ్యాయులు వాకా చంద్రశేఖర్, మహేష్‌కుమార్, సురేష్‌కుమార్, పరిమళజ్యోతి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప టూటౌన్ సీఐగా ఇబ్రహీం


కడప టూటౌన్ సీఐగా బదిలీ అయిన సీఐ జి. ఇబ్రహీం


వీఆర్‌కు బదిలీ అయిన సీఐ ఎం. తబ్రేజ్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తున్న జి.ఇబ్రహీంను బదిలీ చేస్తూ కర్నూలు– కడప రేంజ్ డీఐజీ విజయారావు ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐగా విధుల్లో చేరిన ఆయన జిల్లాలో పలు స్టేషన్‌లలో పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొందారు. తరువాత ప్రస్తుతం ప్రొద్దుటూరు సీఐగా పనిచేస్తున్నారు. కడప టూటౌన్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా బదిలీ అయిన ఆయన నేడో, రేపో బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా ఇప్పటివరకు కడప టూటౌన్ సీఐగా పనిచేసిన ఎం.తబ్రేజ్ గత ఏడాది అక్టోబర్ 13న కడప టూటౌన్ సీఐగా బాధ్యతలను చేపట్టారు. ఇటీవల పరిపాలన సంబంధమైన కారణాలతో ఆయనను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

డీటీ మనోహర్‌రెడ్డి బదిలీ

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న జె.మనోహర్‌రెడ్డిని రాజుపాళెం మండలానికి బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కేవీ సాయినాథరెడ్డిని ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఆరుగురు డిప్యూటీ తహసీల్దార్లను కలెక్టర్ విజయరామరాజు బదిలీ చేశారు.